# ఎందుకిలా జరుగుతూంది?

"నాన్నా! నిన్నే నాన్నా! నాకు పొగడపూలు తేలేదేం నాన్నా?"

"మర్చిపోయానమ్మా! రేపు తెస్తానులే" అన్నాడు చంద్రం చూస్తున్న ఫైల్లోనుంచి తల ఎత్తకుండానే యదాలాపంగా.

కిలకిలా నవ్వింది ఐదేళ్ళ కవిత. ఆ నవ్వుకు ఉలిక్కిపడి తలెత్తి చూశాడు చంద్రం. కళ్ళముందు 'రాజి' కాదు 'కవిత'. బుగ్గమీద పడుతున్న ముంగురులను పళ్ళసందున ఇరికించి ఇకిలిస్తూ నిల్చుంది. చంద్రం నెత్తిమీద ఏదో బలంగా తగిలినట్లు దిమ్మెరపోయాడు. చేతినుంచి కలం కిందకుజారింది. కళ్ళముందు చీకట్లు. మళ్ళీ రంగులు. ఎరుపు, తెలుపు, పసుపు, నలుపు, రంగురంగులు. పెద్ద కారుమేఘం దూరంగా పోతున్నది. దాని వెనకే ఇంకో మేఘం.

మేఘం విడిపోతుంది. అరే! ఏదో గ్రామం కనిపిస్తుందే! తనకు తెలిసిన గ్రామమే అది. అదో! ఆ కనుపించే ఎర్ర బంగళా తమదే! ఇంటిచుట్టూ పూలచెట్లు. ఆ తోటలోని ప్రతిపువ్వు ప్రతిమొక్క తనకు పరిచితమైనదే.

అదుగో ఎవరో కుర్రాడు. తెల్లగా, బక్కపల్చగా, అందంగా ఉన్నాడు. తూనీగల్ని పడుతున్నాడు. సీతాకోక చిలుకనికూడా పట్టటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని ఒక్కటీ చిక్కటంలేదు.

తనకు తూనీగలంటే ఎంతో ఇష్టం. ఆ కాడకొస్తే తనకు ఇష్టంలేని పక్షిగాని, చెట్టుగానీ, పువ్వుగానీ ఏదీలేదు. తనకు గులాబి పువ్వంటే ఎంతఇష్టమో గన్నేరుపువ్వంటేనూ అంత ఇష్టమే. తనకు అమ్మంటే ఎంత ఇష్టమో నాన్నంటే కూడా అంతేఇష్టం. కాకపోతే నాన్నంటే కొంచెం భయం. ఆ మాటకొస్తే తనకు జవాను రంగడుఅంటే కూడా అంత ఇష్టమే. నాన్న అతన్ని తిట్టినప్పుడు తనకెంత ఏడుపు వచ్చేదో? నాన్నమీద కోపంకూడా వచ్చేది.

తనకు ఇష్టంలేనిది గొంగళిపురుగు మాత్రమే. దాన్ని చూస్తేనే తనకు అసహ్యం. వాటిని చంపటంలో ఒక విధమైన ఆనందం కలిగేది. కాని తనకు అతి ప్రియమైన సీతాకోక చిలుక గొంగళిపురుగు పొట్టలో దాగి ఉంటుందని తెలిసినప్పటినుంచి గొంగళిపురుగుల్ని చంపటం మానేశాడు.

కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. పచ్చికమీద రంగురంగుల రెక్కలతో తూనీగలు వాలుతూ, ఎగురుతూ ఉన్నాయి. అరే! తను ఎంత ప్రయత్నించినా ఒక్కటికూడా చిక్కటంలేదే!

వెనకనుంచి కిలకిల నవ్వు వినిపించింది. తను వెనక్కు తిరిగిచూశాడు. తన ఈడు అమ్మాయి పచ్చపువ్వుల ఎర్ర

పరికిణీ, ఎఱ్ఱపువ్వుల నల్లజాకెట్టు, బుగ్గలమీదగా జారిపడుతున్న నొక్కులజుట్టు పళ్ళసందున ఇరికించి పళ్ళు బిగించి కొంటెగా నవ్వుతోంది. ఎంత బాగుంది ఆ అమ్మాయి! అచ్చం నాన్న తనకు బొంబాయినుంచి తెచ్చిన బొమ్మలా ఉంది! ఇంకా నవ్వుతూనే ఉంది. బహుశా తన్నుచూసే నవ్వుతోందేమో? బలేకోపం వచ్చింది. ఆ పిల్లదగ్గరకు వెళ్ళాడు కోపంగా.

"ఏయ్! ఎవరు నువ్వు?"

"ఎవరేంటి! నేనే!" మళ్ళీ కిలకిల మంది.

"ఎందుకొచ్చావ్ మా తోటలోకి?"

"పొగడ పూలకోసం" అంది కళ్ళు తిప్పుతూ.

"అయితే నన్నుచూసి ఎందుకు నవ్వావు?"

"నీకు తూనీగల్ని పట్టటం రాదని" మళ్ళీ కిలకిలా నవ్వింది.

"నీకు మహావచ్చినట్లు?" అన్నాడు దెబ్బతిన్న అహంతో.

"ఓ నాకు వచ్చు! వెంకటేశు, సుబ్బాయి, లచ్చి, కోటాం, వీళ్ళందరికంటే నాకు తూనీగల్ని పట్టటం బాగా వచ్చు. తెలుసా?" అన్నది ఆ అమ్మాయి తన గుండ్రని పెద్దపెద్ద కళ్ళను తమాషాగా తిప్పుతూ.

"బలే ఉంది" అనుకున్నాడు తను.

"అయితే ఇప్పుడు పట్టు చూస్తాను" అన్నాడు ఆ పిల్లతో. తను అలా అన్నాడో లేదో తుర్రున తూనీగలా వెళ్ళి రెండు నిముషాల్లో రెండు చేతుల్లో రెండు తూనీగల్తో

వచ్చి తనముందు వాలింది. అవి తనను తోకతో చుట్టుకొని తమాషాగా ఉన్నాయి. తను ఆశ్చర్యంతో, ఆనందంతో ఉక్కిడిబిక్కిరి అయిపోయాడు. ఆ అమ్మాయి చేతులోనుంచి తూనీగల్ని పట్టుకోవటానికి చేతులు చాపాడు. ఆ అమ్మాయి వాటిని తనకు అందించబోయినట్లు చేతులు ముందుకు చాచి మళ్ళీ చటుక్కున వాటిని వదిలేసింది. తను బిక్క మొహం వేశాడు. అమ్మాయి కిలకిలా నవ్వింది. తనకు ఉడుకుబోతుతనం వచ్చింది. ఉక్రోషంతో లాగి చెంపమీద కొట్టాడు.

ఆ అమ్మాయి ఏడుపుకు లంకించుకుంది అమ్మా వాళ్ళు ఆ ఏడుపు ఎక్కడ వింటారోనని తను భయపడి పోయాడు. ఏడవవద్దని ఆ అమ్మాయిని తను బతిమాలు కున్నాడు. ఆ తోటలోవున్న పువ్వు లన్నీ కోసుకోమ న్నాడు. రోజూ వచ్చి పొగడపూలు కోసుకోమన్నాడు. తూనీగల్ని పట్టుకోమన్నాడు. చివరకు ఆ పిల్ల ఏడుపు మానింది. మళ్ళీ కిలకిలా నవ్వింది.

ఇద్దరూ కలిసి పొగడపువ్వులు కోశారు. దండలు గుచ్చారు. ఆ అమ్మాయి ఎంతోసంతోషంతో తల్లో పొగడ పూలదండ తురుముకుంది. మెళ్ళో దండవేసుకుంది. ఆనం దంతో ఆ పిల్ల కళ్ళు మెరిశాయి. రోజూ రమ్మన్నాడు. ఆ పిల్ల రానంది. తనకు మళ్ళీ కోపం వచ్చింది. అలిగాడు. బుంగమూతి పెట్టుకుంది ఆ పిల్లకు మంచిమంచి బొమ్మలు చూపిస్తానన్నాడు. ఆ పిల్ల ఆనందంతో రోజూ వస్తానంది. ఆనందంతో ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి భజనచేసే తన కోతి

బొమ్మను తెచ్చి ఆ అమ్మాయి చేతిలో పెట్టాడు. ఆ అమ్మాయి ఇంతింత కళ్ళు చేసుకొని "నా కిస్తావా!" అని ఆశగా అడిగింది.

"మరి నాతో రోజూ ఆడుకుంటావా?"

"ఆఁ!" అంది ఆ అమ్మాయి.

"మరి నీ పేరు?"

"రాజి. నీ పేరు?"

"చంద్రం"

"ఇంకా బొమ్మలు ఇస్తాను. మరి నా నేస్తం వదలవు గదూ?"

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తూ "ఇంకా ఎన్ని ఇట్లాంటి బొమ్మలున్నాయ్ నీ దగ్గర?"

"ఇన్ని!" అంటూ రెండు చేతులూ వీలయినంత దూరంగా పెట్టి చూపించాడు.

"ఆ కోతిముఖం కోటాయిని పెళ్ళి చేసుకోను. నిన్నే చేసుకుంటా. ఎంచక్కా మనం ఆడుకోవచ్చు గదూ?" అంది రాజి ఆనందంతో.

"నిజంగా నన్ను పెళ్ళి చేసుకుంటావా?" ఆనందంతో గెంతుతూ తను చప్పట్లు కొట్టాడు.

"అయితే రాజీ! నువ్వికనుంచి నే చెప్పినట్లు వినాలి. తెలిసిందా?" అంటూ అధికార యుక్తస్వరంలో అన్నాడు.

రాజి కిలకిలమని నవ్వింది. రాజి ఎంతోసేపు దెయ్యాల కథలు వినిపించింది. అమ్మ తనను 'చీకటిపడుతోంది లోపలికి

రమ్మ'ని కేక పెట్టింది. చంద్రం లేచాడు. రాజి వెళ్ళిపోతూ "రేపు సాయంకాలం నాగేశ్వరస్వామి గుడికాడికి వస్తావా? మేమంతా ఉయ్యాలాటలు ఆడుకుంటాము" అంది.

"వస్తాను" అంటూ అమ్మ పెట్టిన మరో కేకకు ఇంట్లోకి పరుగెత్తాడు చంద్రం.

ఆ రోజు అట్లతద్దె. నాలుగుగంటలవుతుంది. చంద్రానికి నాగేశ్వరస్వామి గుడికి వెళ్ళాలని ఉంది. కాని అమ్మా వాళ్ళు తనను బయటకు పోనివ్వరు. వెళ్ళినా ఆయా వెంటనే వెళ్ళాలి. అటూ ఇటూ చూశాడు చంద్రం. అమ్మ వంటింట్లో ఉంది. ఆయా తమ్ముడిని ఆడిస్తోంది. చంద్రం చిన్నగా తోటలోకి జారుకొని అక్కడనుంచి ఒక్క పరుగులో బయటకు వచ్చిపడ్డాడు. గేటుదాటి లంకించుకున్న పరుగు నాగేశ్వర స్వామి గుడికి వెళ్ళిగాని ఆగలేదు.

గుడి వెనకనున్న వేపచెట్టుకు తాడు ఉయ్యాలవేసి ఉంది. ఒక అమ్మాయి కూర్చొని ఊగుతోంది. పిల్లలంతా పంక్తులు పంక్తులుగా నిల్చొని తమతమ వంతులకోసం ఎదురు చూస్తున్నారు. పిల్లలంతా కొత్త బట్టలు వేసుకున్నారు. రాజికూడా కొత్తబట్టలు వేసుకుంది. తను రోజూ మంచిబట్టలే వేసుకుంటాడు. రాజి తనను చూసి ఎదురు పరుగెత్తుకొచ్చింది. తనను చూడగానే పిల్లలంతా తనచుట్టూ మూగారు తనకు చిరాకనిపించింది. కాని వాళ్ళంతా తన దగ్గరున్న బొమ్మల్ని గురించి ఆశ్చర్యంగా ప్రశ్నలు వేస్తుంటే తనకు బలే గర్వం అనిపించింది. వాళ్ళమధ్య తను రాజు అనుకున్నాడు. మరి

రాజుకు ఓ రాణీ కావాలిగా? వెంటనే పక్కనేఉన్న రాజి తనకు రాణీలా అనిపించింది. తను రాజు. రాజి రాణి. దాయిచెప్పే కథల్లోని రాజకుమారుడు తనే. రాజకుమార్తె రాజి!

"ఏరోయ్ ! కోటాయ్ ! పిలకాడా? ఇక్కడకురారా? బంగళా చినబాబుగారు వచ్చారు చూడు!" అంటూ రాజి గర్వంగా రాణీలా చేతులు కట్టుకొని తనపక్కన నిల్చుంది. తను పక్కకు చూశాడు. చెట్టుకింద దూరంగా తనకంటే ఎత్తూ, లావూ ఉన్న కుర్రాడు తనవైపు కొరకొరా చూస్తు న్నాడు! నల్లగా, తుమ్మమొద్దులా ఎర్ర పంచా వాడూ-'వీణ్ణా నా రాజి పెళ్ళాడుతుంది!' అనుకున్నాడు తను.

ఉయ్యాల ఊగుతున్న అమ్మాయి దిగింది. రాజి తనను ఎక్కమన్నది.

'పిల్లలందరికీ రాజి రాణియే. ఆమె ఎంతచెబితే అంత' అనుకున్నాడు తను.

తనకు ఊయల ఎక్కుతుంటే బలే భయంవేసింది. ఎలాగో రాజి సహాయంతో ఎక్కి కూర్చున్నాడు. తనకు ఇంకొకరి సహాయంలేకుండా ఊగటంరాదు. ఊపమన్నట్లు వెనుదిరిగి రాజివైపు చూశాడు. పిల్లలంతా గొల్లున నవ్వారు. ఇంతలో కోటాయి బాణంలా దూసుకొనివచ్చి ఊపినట్లే ఊపి తనను ముందుకుతోశాడు. తను బొక్కబోర్లా పడ్డాడు. ముక్కునుంచి రక్తం కారుతోంది. ముఖంనిండా ఇసుక. తను పెద్దగా ఏడ్వసాగాడు. తనకు సాయం చెయ్య

టానికి ఎవరూ రాలేదు పైగా పెద్ద ఎకిలిగా చప్పట్లు చరుస్తూ నవ్వసాగారు. రాజికూడా విరగబడి నవ్వుతోంది.

"బంగాళా బాబుకు ఉయ్యాల ఊగటం ఏం తెలుసురా?" అన్నాడు పిలకోడు కోటాయి.

"ఆడపిల్లల్లే ఇంట్లోనే ఆడుకుంటాడు" అంటూ చప్పట్లు చరిచాడు చీమిడిముక్కు సుబ్బాయి.

"పంతులయ్యదగ్గిర బుద్ధిగా కూకొని చదువుకుంటాడు కూడా" అంది తేలుకొండి జడతో ఉన్న మాణిక్యం.

మళ్ళీనవ్వులు. రాజిస్వరం అందరికంటే తారస్థాయిలో వినిపిస్తుంది.

"మరేమో...ఈ దొరగారికి...తూనీగల్ని పట్టటం కూడా రాదు" అంది మధ్యమధ్య పగలపడి నవ్వుతూ రాజి.

తను అవమానంతో కోపంతో వణికిపోయాడు. ఏడుస్తూనే గుప్పెడు ఇసుకతీసి రాజి మొహంమీదకొట్టి అక్కడి నుంచి పరుగెత్తాడు.

తను ఏడుస్తూ పరుగెత్తుతూనే వున్నాడు. పిల్లల నవ్వులు రాజి ఏడుపుతో మేళవించి తనకు వినిపిస్తూనే ఉన్నాయి.

రాజి ఏడుపు విన్న తనకు కొంత ఊరట కలిగినట్లనిపించింది.

ఆరోజు ఇంటిదగ్గిర చెప్పకుండా వెళ్ళినందుకు నాన్న చేత నాలుగు చీవాట్లూ, అమ్మచేత రెండు దెబ్బలూ తిన్నాడు. ఆరోజు ఆయా కూడా తనతో మాట్లాడలేదు.

ఆ రాత్రినుంచే తనకు జ్వరం ప్రారంభం అయింది. సన్నిపాత జ్వరం. చావుతప్పి బయటపడ్డాడు ఎలాగయితేనేం.

అది మధ్యాహ్నం పన్నెండుగంటల సమయం. దాయి తన మంచం ప్రక్కనే నిద్రపోతూంది. అమ్మ నాన్నతో ఎక్కడికో వెళ్ళింది. తను వాకిలివైపు చూస్తూ, ఆనాడు జరిగిందాన్ని తలుచుకుంటూ పడుకున్నాడు. రాజి జ్ఞాపకం వచ్చి పళ్ళు పటపట కొరుక్కున్నాడు కోపంతో.

ఇంతలో రాజి అడుగులో అడుగు వేసుకుంటూ లోపలకు రావటం చూశాడు తను. కోపంతో రెండోవైపుకు మొహం తిప్పుకొని పడుకున్నాడు.

"బాబుగారూ ! ఎలా ఉంది ?" అంది భయంగా.

"మరేఁ నేను పెళ్ళి చేసుకుంటానుగా ? మరి నువ్వు ఛచ్చిపోతే ఎట్టా" అన్నది రాజి వచ్చే ఏడుపును గొంతులోనే దిగమింగుకుంటూ.

తను సంతోషంతో మొహం రాజివైపుకు తిప్పాడు. రాజి బిక్కమొహంతో మంచానికి ఆనుకొని నిల్చొనివుంది. "నిజంగా నన్ను పెళ్ళాడతావా ?" అంటూ రాజి చెయ్యి పట్టుకున్నాడు. పెళ్ళంటే ఏమిటో అర్థం తెలియని తను.

మళ్ళీ అంతలోనే "మరి నాకు తూనీగల్ని పట్టటం రాదుగా. ఉయ్యాల ఊగటంకూడా రాదు" అన్నాడు బిక్కమొహంతో తన ఓటమిని ఒప్పుకుంటూ.

"పరవాలేదులే. మా దొడ్లో పొగడచెట్టుంది. నువ్వు బాగా దండలు గుచ్చుతావుగా" అంది.

దాయి కదలటం చూసి రాజి తుళ్ళుమంది. కొద్దిరోజులకే తనకు ఆరోగ్యం చేకూరింది.

ఆ రోజు మధ్యాహ్నం పిల్లలంతా కలసి నాగేశ్వర స్వామి గుడిముందు తనకూ రాజికీ పెళ్ళి చేశారు. పొగడ దండలు వేశారు. తాటాకు బూరలు ఊదారు. గుడిచుట్టూ మూడుసార్లు తిరిగారు. ఇలాగే అందరూ సాయంకాలంవరకు ఆడుకొని ఇళ్ళకు బయలుదేరారు.

రాజి మధ్యమధ్య ఆగి తూనీగల్ని పట్టి తనకిస్తుంది. తను పట్టుకోబోయి వదిలేస్తున్నాడు.

మధ్యదారిలో నేరేడుచెట్టు కనిపించింది. తను ఆగి పళ్ళకోసం రాళ్ళు విసరసాగాడు. ఒక్కటీ పడందే ?

రాజి చప్పట్లుచరుస్తూ, విరగబడి నవ్వసాగింది. తనకు వళ్ళు మండిపోయింది. కాని ఏం చెయ్యలేక ఏడుపు వచ్చింది. తన ఏడుపుముఖం చూచేటప్పటికి రాజికి జాలి వేసింది. గబగబా చెట్టెక్కింది. తను ఇంతింత కళ్ళు చేసుకొని రాజిని చూడసాగాడు. ఆరోజు రాజి తనదృష్టిలో ఎంత గొప్పగా కనిపించిందో! తను రాజిముందు వామనుడు !

చెట్టు ఊపుతున్నది. పళ్ళు టపటప రాలుతున్నాయి. తన నెత్తిమీదగా భుజాలుమీదగా. తను ఆనందంతో ఏరుకుంటూ జేబులు నింపుకుంటున్నాడు. ఇంతలో పెళ పెళా మంటూ కొమ్మ విరగడం, ఆ కొమ్మతోపాటు రాజి నేల మీద పడటం క్షణంలో జరిగిపోయింది.

అంతా రక్తమయం. అంతే ఆ తరువాత ఏం జరిగిందో తనకు తెలియదు. తెలివివచ్చి కళ్ళు తెరిచేసరికి తను ఇంట్లో

మంచంమీద పడుకొని ఉన్నాడు. మంచంచుట్టూ అమ్మా, నాన్నా, దాయీ, డాక్టరూ, ఇంకా ఎందరో ఆదుర్దాగా తనవైపే చూస్తూ నిల్చొని ఉన్నారు.

ఆ తరవాత వారంరోజుల్లోనే నాన్నకు బదిలీకావటం, తను ఆ ఊరునుంచి వెళ్ళిపోవటం జరిగింది. ఆ తరవాత రాజి బొమ్మ అతని హృదయంలో మాసిపోయింది.

* * *

"నాన్నా నాన్నా! డబ్బా నాన్నా" చంద్రం ఉలిక్కి పడి చూశాడు. కవిత రెండుచేతుల్లో రెండు తూనీగల్తో నిల్చొని వుంది.

కళ్ళముందు మరో మేఘం. క్రమంగా మేఘం విచ్చి పోతుంది. అదే గ్రామం. అదే బంగళా! తను ఇప్పుడు ఓ పెద్ద ఆఫీసరు. నవయువకుడు. అందగత్తె విద్యావతి అయిన భార్య. జీవితం వడ్డించిన విస్తరిలా నిండుగా వుంది. ఆ ఊరు మొదటిసారిగా క్యాంపుకు వెళ్ళాడు.

బంగళా వరండాలో కూర్చొని సిగరెట్టు తాగుతూ ఆలోచిస్తున్న తనకు అకస్మాత్తుగా రాజి జ్ఞాపకం వచ్చింది. పదిహేను సంవత్సరాలకిందటి రాజితో స్నేహం. ఒక్కొక్క దృశ్యమే కళ్ళముందు కదలసాగింది. ఇప్పుడు రాజి ఏమయిందో ఎలా ఉందో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగింది. ఆఁ ఏమయి ఉంటుంది! ఆ పిలకజుట్టు కోటాయిగాణ్ణి పెళ్ళాడి ఉంటుంది!

ఓ యువతి తుఫానులా వచ్చి తనముందు నిలబడ డంతో తన ఆలోచనలకు అంతరాయం కలిగింది. తెల్ల బోయి చూస్తున్నాడు. పాలిపోయి బలహీనంగా, రేగిన జుట్టుతో, మాసిన బట్టలతో తనముందు అంత విసురుగా వచ్చి నిలబడ్డ ఆ పల్లెయువతిని చూసి తికమకపడ్డాడు తను.

"పట్టణంలో మా బంగళాబాబు తెలుసా ?" అని అడి గింది ఆ అమాయకమైన కళ్ళను పెద్దవిచేస్తూ.

అరే ! అదే గొంతు, అవే కళ్ళు ! రాజి. తన రాజి! ఆశ్చర్యంవేసింది చంద్రానికి. తను ఇంతవరకూ ఊహించు కుంటున్న రాజికి ఈ రాజికి ఎక్కడా పోలిక లేదు. తమాషా చెయ్యాలనిపించింది.

"పట్టణంలో ఎందరో బాబులుంటారు. మీ బాబు ఎవరో ఎలా తెలుసుకోవటం ?"

"మా చంద్రంబాబు ఒక్కడే. ఎంతమందో ఎట్టా వుంటారు ? అయితే పట్టణంలో ఉంటూ మా బాబునే ఎర గవా" అన్నది రాజి తనను పిచ్చివాణ్ని చూసినట్లుచూస్తూ.

"ఓ చంద్రమా ! తెలుసు ! ఏం చెప్పమంటావు ?"

"రాజి నీకోసం ఎదురుచూస్తుంది. తొందరగా వచ్చి తీసుకెళ్ళమని చెప్పు."

చంద్రం తెల్లబోయాడు. నోట మాటరాలేదు.

"ఏం బాబూ చెబుతావుగదూ ? చంద్రం నా పెని మిటి. చిన్నప్పుడు మేమిద్దరం గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం" అన్నది గబగబా పాఠం అప్పజెప్పినట్లు.

ఎవరో వెనకనుంచి కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లయింది చంద్రానికి. ఆమె అమాయకత్వానికి జాలి కలిగింది.

"కాని చంద్రానికి ఆ పెళ్ళి గుర్తులేదు అతనికి పెళ్ళయింది. పదిరోజుల్లో పాపకూడా పుట్టబోతుంది" అన్నాడు జాలిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

తను ఊహించినట్లు ఆమె కళ్ళల్లో నీరు తిరగలేదు. ముఖ కవళికలుకూడా ఆట్టే మారలేదు. కొంచెంసేపు అలాగే నిల్చొని ఏదో గొణుక్కుంది తనలో తనే పిచ్చిదానిలా.

"ఇదుగో ఈ డబ్బా మా బాబుగారికి ఇవ్వండి. నేను చచ్చిపోయి ఆరి కడుపున పుడతానని చెప్పండి. నా పేరే ఆ పాపకు పెట్టమని చెప్పండి" అంటూ రాజి తన చేతులోవున్న తుప్పుపట్టిన ఓ సిగరెట్ డబ్బాను చంద్రం ముందున్న టేబుల్ మీద పెట్టింది.

"ఏయ్ రాజీ! ఇక్కడకెందు కొచ్చావ్!" అంటూ తోటమాలి చేతులో కర్రతో వరండాలో ప్రవేశించాడు.

మాలీని చూస్తూనే రాజి కిలకిలమంటూ నవ్వుతూ తుర్రున తూనీగలా పారిపోయింది.

తను చలనంలేని బొమ్మలా కూర్చుండిపోయాడు.

"ఆ పిచ్చిదానితో మీకెందుకు బాబూ!" తన గుండెల్లో ఎవరో గునపం గుచ్చినట్లయింది. రాజి పిచ్చిదా! తన రాజి పిచ్చిదా!

"చిన్నప్పుడు నేరేడు చెట్టుమీదనుంచి పడ్డది. బతుకుదనుకోలా. చచ్చిపోయినా బాగుండేది. బతికింది కాని మతిపోయింది. తల్లీ తండ్రీ అందర్నీ మరిచిపోయింది. ఆ రోజుల్లో

ఈ బంగళాలో ఉన్న పోస్టుమాస్టరుగారబ్బాయి చంద్రం రాజికంటే రెండేళ్ళు పెద్ద. ఇద్దరూ చాలా స్నేహంగాఉండే వారు. పిల్లలంతా ఆటల్లో వాళ్ళిద్దరకూ గుళ్ళోపెళ్ళి చేశారంట. రాజి అన్నీ మరిచిపోయింది. కాని ఆ బంగళ బాబును మర్చిపోలేదు. తనకు బంగళాబాబుతో పెళ్ళయిందనీ, ఆ బాబువచ్చి రేపు తనను పట్టణం తీసుకెళతాడనీ చెబుతూ తిరుగుతుంటుంది. ఇంటిపట్టున ఉండదు. కొన్నిరోజులు వరసగా తిండికూడా తినదు బాబూ. ఊళ్ళోవాళ్ళంతా దాన్ని ఎంతో ఇదిగా చూస్తారు."

మాలి చెబుతున్న కథ వింటుంటే తను ఎంతో తప్పు చేసిన వాడిలా బాధపడ్డాడు.

"అరే! ఆ డబ్బా ఇక్కడ వదిలేసిందే? అది ఆ డబ్బాను వదల్దుబాబూ! ఇంకోర్ని ముట్టుకోనివ్వదుకూడా" అంటూ ఆశ్చర్యంగా అన్నాడు మాలి.

తను ఆ డబ్బాను చేతిలోకి తీసుకొని యాంత్రికంగా తెరిచాడు. ఆ డబ్బాలో కొన్ని తూనీగల రెక్కలూ, పొగడ దండలూ చూసిన తన కళ్ళవెంట నీరు బొటబొట కారింది.

తనులేచి గదిలోకి వెళ్ళి తలుపు బిగించుకున్నాడు. ఎందుకో దుఃఖం పొర్లివచ్చింది. రాత్రంతా కలతనిద్ర, నిద్రలో పీడకల. కలలోరాజి...పిచ్చిది. చీకటితోనే లేచి స్నానంచేస్తుంటే తనకు ఓ ఆలోచన తట్టింది. రాజిని పట్నం తీసుకెళ్ళి ఆసుపత్రిలో చేరిస్తే! ఆపరేషన్ చేయిస్తే బాగు కావచ్చును. తనను సంతోష పెట్టటానికి నేరేడుపళ్ళు కోయబోయి ఈ స్థితికి వచ్చింది.

ఒక అమాయక బాల ఈ స్థితిలో కూడా చిన్ననాటి స్నేహాన్ని కూడా మర్చిపోలేక పోయింది! తనో! తను శ్రీమంతుల బిడ్డ. సభ్యత తెలిసినవాడు. విద్యావంతుడు. అందువల్ల అలాటి పవిత్ర స్నేహానికి విలువ నివ్వలేకపోయాడు. ఏది ఏమయినా రాజిని పట్నం తీసుకెళ్ళాలి. బాగు చేయించాలి. చదువు చెప్పించాలి. తను ఆమెను గురించి ఆలోచిస్తూనే బాత్‌రూమ్‌లోంచి బయటకు వచ్చాడు. హృదయం కొంచెం తేలికయి నట్లనిపించింది.

ఇంతలో మాలి తలగుడ్డతో కళ్ళొద్దుకుంటూ తన దగ్గరకొచ్చి "బాబూ! పాపం ఆ పిచ్చిది చచ్చిపోయిందట. ఎలా చచ్చిపోయిందో తెలియదు. తెల్లారేప్పటికి నాగేశ్వర స్వామి గుడి గడపలమీద చచ్చి పడివుంది."

తనకు ఆ పైన వినిపించలేదు.

* * *

"నాన్నా! డబ్బా నాన్నా" కవిత చంద్రాన్ని ఊపుతోంది. చంద్రం తన ఆలోచనలనుంచి బయటపడ్డాడు.

"ఏమిటీ వింత! రాజి నిజంగానే చచ్చి తన కడుపున పుట్టిందా! అదేరూపం—అవే అలవాట్లు. తనకు పునర్జన్మలో నమ్మకం లేదు. కాని మరి ఇలాంటి సంఘటనల చాటున ఏ సృష్టి రహస్యం దాగిఉందో! మానవుడు ఈనాడు విజ్ఞానంలో మహోన్నత శిఖరాన్ని అందుకున్నాడు. చంద్ర మండలానికి ప్రయాణ సన్నాహాలు చేస్తున్నాడు. ఇన్ని చేస్తున్న మానవుడు జీవి జన్మమరణాల రహస్యాన్ని ఏనాటికయినా తెలుసుకో గలడా?

రాజి తన కడుపున పుడతానంది. తనపేరే పెట్టుకో మన్నది. ఆమె తనమాటను నిలబెట్టుకొన్నది. కాని తనో! తను ఓడిపోయాడు. తన అంతస్థూ తన సభ్యతా తన కూతురుకు 'రాజి' అనే పేరు పెట్టటానికికూడా అడ్డొచ్చాయి. కవిత అంతా రాజిలాగే మాట్లాడుతుంది.

"నాన్నా! ఆ డబ్బా నాన్నా."

"ఏ డబ్బా! ఆఁ అదా! దాన్ని అప్పుడే వదిలేశాను రాజీ! నన్ను క్షమించు రాజీ!" అంటూ చంద్రం కవితను గట్టిగా పట్టుకొన్నాడు.

"రాజి ఎవరునాన్నా ?" అన్నది కవిత తన చిన్ని నోరును పెద్దగా తెరుస్తూ. చంద్రం తెప్పరిల్లాడు.

కవితకు రాజిపేరు గుర్తులేదు. కాని మరి ఆ డబ్బా అడుగుతుందేం? చంద్రం ముఖంమీద చెమట బిందువులు కనిపిస్తున్నాయి. భయం భయంగా కవిత కళ్ళలోచూస్తూ "ఏడబ్బా!" అన్నాడు వణుకుతున్న గొంతుతో.

"అదే నాన్నా! నీ సిగరట్టుడబ్బా! తూసీగల్ని వేసుకుంటా" అన్నది. కవిత చక్రాల్లాంటి కళ్ళను గుండ్రంగా తిప్పుతూ.

కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ, ఒక నిట్టూర్పు విడిచాడు చంద్రం. కవిత తన రెండు చేతుల్లోఉన్న తూనీగల్ని వంగివంగి చూసుకుంటున్నది పరవశత్వంతో. అచ్చం రాజిలాగే ఉందనుకున్నాడు చంద్రశేఖర్.